బిల్ ఫౌండేషన్ సేవలు విస్తృతం

అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి. విఠలేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నిస్వార్థంగా నిత్య సేవలు చేస్తున్న బిల్ ఫౌండేషన్ సేవలకు అంతం లేదని, ఫౌండేషన్ సేవలు విస్తృతమని ఒక వార్షికోత్సవ వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి. విఠలేశ్వర రావు అన్నారు. గురువారం జరిగిన వార్షికోత్సవ వేడుకలలో స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ బిల్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రతి నిత్యం వార్త పత్రికల ద్వారా చూస్తున్నానని, సేవలు ఇలాగే, కొనసాగాలని ఆకాంక్షిస్తూ బిల్ ప్రెసిడెంట్ సత్య సాయి, వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

విశాలాంధ్ర-గార : మూలపేట పోర్ట్ నిర్వాసితుల పక్షాన, వారి సమస్యల పరిష్కారానికై అఖిలపక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సీపీఐ నాయకులు చాపర వెంకట రమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోర్టు నిర్మాణం కోసం తమ భూములను త్యాగం చేసిన రైతులకు పూర్తి న్యాయం జరగడం లేదని నిర్వాసితుల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందించి నిర్వాసితుల పక్షాన పోరాడుతామని తెలిపారు. శ్రీకాకుళం పాత బస్ స్టాండ్ దరి ఎన్జీఓ హోమ్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందని, ఈ సమావేశంలో వామపక్ష, కార్మిక, ప్రజా సంఘాలు, మేధావి వర్గాలతోపాటు పలు రాజకీయ పార్టీల వారు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, యువకులు, అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ప్రకటనలో కోరారు.

వైఎస్ఆర్ భీమా అందజేసిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-రణస్థలం : ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం వల్లభరావుపేట గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన దువ్వాన రమణ కుటుంబ సభ్యులను, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించారు. వైఎస్సార్ భీమా పథకం కింద 5లక్షలు భీమా వర్తిస్తుందని, వైఎస్సార్ భీమా పథకం కింద తక్షణ ఆర్థిక సహాయం 10వేల రూపాయలను మృతుని భార్యకు, ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జే.సి.యస్ ఇన్‌చార్జ్ చిల్ల వెంకటరెడ్డి, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురాన చిరంజీవి, దువ్వాన లక్ష్మణరావు, పాలూరి బుజ్జి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-ఆమదాలవలస: అలమాజీపేట వద్ద నున్న పట్టణ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రానికి విద్యుత్ అంతరాయం వల్ల పట్టణంలో శుక్రవారం నీటి సరఫరా జరగదని మున్సిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం వర్షానికి చెవ్వాకులపేట సమీపంలో విద్యుత్ వైర్లపై తాటిచెట్టు పడిపోవడంవల్ల విద్యుత్ స్థంభాలు నేలకొరిగి సరఫరాలో అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. కావున పట్టణంలో ఉదయం త్రాగునీటి సరఫరా ఉండదని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. వీలైనంత త్వరితగతిన సేవలు పునరుద్ధణకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు

విశాలాంధ్ర-జలుమూరు: జగనన్న కాలనీలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ టిఎస్ ప్రసాద్ అన్నారు. జలుమూరు మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస గ్రామాల్లో జగనన్న కాలనీ ఇళ్లల్లో తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. గ్రామం నుండి తాగునీటి పైపులైన్లు ఏర్పాటుచేసి ఇంటికి కొళాయిలు ఇస్తామన్నారు. అవసరమైన చోట బోర్లు తవ్విస్తామని, ట్యాంకులు నిర్మిస్తామని తెలియజేశారు.

విశ్వాంతరం దాటిన భారతదేశ కీర్తి

- భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలకు ఇస్రో వేదిక కావాలి
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

- చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం... చారిత్రక ఘట్టం
- భారతీయ ప్రజ్ఞా పాటవాలకు నిదర్శనం ఇస్రో శాస్త్రవేత్తల దృక్కోణం
- పరిశోధనల్లో అగ్రగామిగా నిలిచిన భారత్
- పలుచోట్ల చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: చంద్రయాన్-3 విజయవంతం కావడంపై ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం హర్షం వ్యక్తం చేశారు. విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ కావడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. 140 కోట్ల భారతీయ ప్రజానీకం యొక్క ఆకాంక్షలు నెరవేరాయన్నారు. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై దిగే చరిత్రాత్మక ఘట్టాన్ని టీవీల్లో అందరూ ఎంతో ఆశక్తితో, కన్నుల పండుగగా తిలకించారన్నారు. భారతీయులందరూ సంతోషంతో ఉప్పొంగిన ఘడియలు మరువలేనివన్నారు. భారతదేశ చరిత్ర పేజీల్లో సువర్ణ అక్షరాలతో లిఖించ దగిన దినంగా ఆయన కొనియాడారు. వారందరికీ దేశ ప్రజానీకం యావత్తు కృత జ్ఞతలు తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. భారతదేశానికి ఇంతటి ఘనకీర్తి తెచ్చిన ఇస్రో శాస్త్రవేత్తలు అభినందనీయులన్నారు. భవిష్యత్తులో వారు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భారతదేశంలో మేధావులకు, విజ్ఞానవంతు లకు కొదవలేదని ప్రపంచానికి నిరూపిత మైందన్నారు. 200 ఏళ్లు భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ దేశానికి కూడా ప్రస్తుతం భారత సంతతికి చెందిన పౌరుడు రుషి సునక్ ప్రధానిగా ఉండడం గర్వ కారణ మన్నారు. ప్రస్తుతం చంద్రయాన్-3లో భాగంగా విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతం కావడంతో ప్రపంచంలో నాలుగో దేశంగా భారతదేశం ఖ్యాతి గాంచిందన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువం పై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందన్నారు. ప్రస్తుతం ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోందన్నారు.

శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: చంద్రయాన్ 3 సక్సెస్ ద్వారా

విశ్వానికి ఆదిగురువు భారత్ గా మారిందని, రోదసీ పరిశోధనల్లో ఇండియా అగ్రగామిస్థానం దక్కించుకుందని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. గురువారం శ్రీకాకుళం నగరంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీ ను ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు సాగింది.. ఇస్రో ప్రయోగం విజయవంతం చేసేందుకు నిరంతరం కృషి చేసిన శాస్త్రవేత్తలకు,వారికి సంపూర్ణ సహకారాన్ని అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని జాతి యావత్తు నీరాజనాలు పలికారని, ఇంతకన్నా గౌరవం ఇంకా ఏముందని అన్నారు. జాబిల్లిపై మువ్వన్నెల జండా ఎగురవేసి భారత్ ప్రపంచానికి సందేశాన్ని ఇచ్చిందని అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ సారథ్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, టీవీ. రవిసంకర్, గుడ్ల సత్యనారాయణ, సింహాద్రి వేణుగోపాల్, బి.దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు, ఇండియన్ ఆర్మీ కాలింగ్ కేంద్రము సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జై భారత్ జయ జయ భారత్ అంటూ నగర వీధుల్లో స్లోగన్స్ ఇచ్చారు. భారత్ మాతాకీ జై అంటూ ఇస్రో శాస్త్రవేత్తలు కు అభినందిస్తూ నినాదాలు చేశారు.. యావత్ ప్రపంచం సంబరాల్లో మునిగిన వేళ.. శ్రీకాకుళం నగరంలో త్రివర్ణ పతాకాలు పట్టుకొని తెల్లవారుజామున వాకర్స్ అంతా నగరవీధుల్లో జై జై భారత్ అంటూ చేస్తున్న నినాదాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

కాకినాడ శ్రీ ఆదిత్య విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

శ్రీకాకుళం టౌన్: ఇస్రో పంపిన చంద్రయాన్ -3 చంద్రుని పై దిగి దేశ కీర్తి ని ప్రపంచ దేశాల్లో మరింత చాటిందని , ఇది దేశం లోని పౌరుల అందరికీ గర్వకారణం అని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ వీ వేణుగోపాల్ అన్నారు. చంద్రయాన్ -3 విజయం పట్ల కళాశాల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భారత మాతకు జై, ఇస్రో సిబ్బంది కృషి కి జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఇస్రో విజయం తో దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో మరింత అభివృద్ధి చెందుతుందని, ఇది దేశ పౌరులకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు. విద్యార్థులకు కూడా మంచి స్ఫూర్తి నింపడమే కాక సైన్స్ పట్ల మరింత మక్కువ పెరుగుతుందని, ఈ విజయం దేశ ప్రజల విజయంగా అందరూ ఆనందం తో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీ వీ ఈ ఎల్ నాయుడు, కళాశాల సిబ్బంది, పెద్ద ఎత్తున విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 ప్రాజెక్ట్‌లో కొత్తూరు యువ శాస్త్రవేత్త

కొత్తూరు : చంద్రుని భుభాగం పై విజయవంతంగా చేరిన ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం యువ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ని గోవిందరావు ఉన్నారు బుధవారం చంద్రయాన్ 3 చంద్రుని భూమి పై విజయంతంగా చేరుకోవడం తో యువ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ని ఇక్కడ కొత్తూరు నేతాజీ నగర్ లో ఉంటున్న తన కుటుం బస్తులుతో ఈ సమచారాన్ని తెలిపి ఆనందాన్ని పంచుకోవడం తో చంద్రయాన్ 3 ప్రాజెక్ట్ లో తమ ప్రాంతీయ వాసి ఉన్నాడని తెలుసుకొని డాక్టర్ ఎన్ని కుటుంబాన్ని పలువురు అభినందించారు.

మారుమూల గ్రామం నుండి ఇస్రోకు...

ఇస్రో యువ శాస్త్రవేత్త ఎన్ని గోవిందరావు స్వగ్రామం కొత్తూరు మండలం బమ్మిడి, కొత్తూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బీటెక్ ఆంధ్రా యూనివర్సిటీ, ఎంటెక్ జేఎన్టీయూ హైదరాబాద్, పీహెచ్‌డి ఐఐటి చెన్నైలో పూర్తి చేశారు. ఎన్ని గోవిందరావు తండ్రి ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందారు. తల్లి గృహిణి, సోదరుడు ప్రభుత్వ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. బావ కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధాన ఉపాధ్యాయులుగా చేస్తున్నారు.

మందస : మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

మరియు పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం చంద్రాయాన్-3 విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రాయాన్-3 విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. చంద్రయాన్ 3 విజయానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సవర. గణేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ ఛైర్పర్సన్ తెప్ప.జ్యోతి, గ్రామ పెద్ద సేనాపతి ప్రకాశరావు, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, యం. లక్ష్మణ రావు,యస్.కిరణ్ కుమార్,యస్ అబ్రహం,పి రాంబాబు, యం.చిత్రసేను, బి.రమేష్, జి.గోపాలకృష్ణలు పాల్గొన్నారు.

పలాస : స్థానిక మదర్ థెరీసా పాఠశాలలో చంద్రయాన్ 3

విజయవంతం కావడంతో గురువారం విద్యార్థులు చంద్రయాన్ 3 అక్షరాల రూపంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతం దేశానికే గర్వకారణంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రసాదరావు, పాఠశాల ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, శశిరేఖ, బేబీ, యశోద, లక్ష్మణరావు, కల్పన, ఈశ్వరి, జీవ రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌పి బోర్డులో

సంతబొమ్మాళి : మండలం దండుగోపాలపురం జిల్లాపరిషత్

ఉన్నతపాఠశాలలో చంద్రయాన్ విజయోత్సవం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగం ఐఎఫ్‌పి బోర్డ్‌లో ప్రదర్శించి విద్యార్థులకు ప్రయోగము చూపించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశములో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య మాట్లాడుతూ ఇది ఒకఅపూర్వ ఘట్టమని, ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ క్షణమని, ఇప్పటి వరకు ఏదేశము చంద్రుని దక్షిణ ధృవం పైకి లాండింగ్ జరపలేదని అన్నారు. ఆ ఘనత సాధించిన మొదటి దేశముగా భారత్ నిలిచిందని, విద్యార్థులు బాగాచదివి ఇస్రోలో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉద్బోధించారు. జయహో ఇస్రో అనే

తెలుగు, ఆంగ్ల అక్షరాకృతిలో విద్యార్థులు కూర్చుని చంద్రయాన్ విజయము పట్ల తమకున్న మక్కువను జయహో భారత్, మేరా భారత్ మహాన్ అని నినాదాలు చేస్తూ ప్రదర్శించారు. ఈప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యమములో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీ ధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, సీఆర్పీ గిరి, రోజా, దయాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కవిటి : మండల కేంద్రమైన కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్

మీడియం పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవిటి పురవీధుల్లో శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు చంద్రయాన్ 3 నమూనాతో భారీ బహిరంగ ర్యాలీని గురువారం ఉదయం నిర్వహించారు.ప్రపంచ ప్రజలందరూ భారత్ వైపు చూపు అంటూ నినాదాలు చేశారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుంటూ ఇస్రో శాస్త్రవేత్తలకు జేజేలు పలుకుతూ వెళుతున్న ర్యాలీలో దేశభక్తిని చాటుకున్న యాత్రను చూస్తూ పలువురు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ సైన్స్ టీచర్ పండి బలరామమూర్తి పాల్గొని విద్యార్థులకు దేశభక్తి ఇస్రో గూర్చి సైంటిస్టులు గూర్చి వివరించారు. ప్రతి విద్యార్థి ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం వలన వారిలో మార్పు వచ్చుటకు నాంది పలుకుతుందని అన్నారు.గత కొద్ది రోజులుగా చంద్రయాన్-3 తిరుగుతూ బుధవారం విజయవంతమైనందుకు శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద దృశ్యాలను స్క్రీన్ పై తిలకిస్తూ విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రాము టీచర్ చేసిన చంద్రయాన్-3 నమోనా అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పండి బిందు మాధవి, ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కవిటి లో ఉషోదయ యువజన సంఘ సభ్యులు ఆధ్వర్యంలో జాతీయ జెండా పట్టుకొని చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరంగి మధు, ఉపాధ్యాయుడు గోపి, భావన రవి, ధర్మరాజు, కోటేశ్వరరావు, ఉషోదయ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : సోంపేట పట్టణంలో సంస్కారభారతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం సంస్కారభారతి జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలోకళాశాల చైర్మన్ వై.దేవరాజు, సెక్రటరీ కరస్పాండెంట్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, డైరెక్టర్ బి.శ్రీనుబాబు, డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ బి.శ్రీరామ్మూర్తి, బి.కవిబాబు, ఏఓ వడగ పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి : జేసీ నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: యువత విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జెసి ఎం.నవీన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బాపూజీ కళామందిర్ లో క్యాంపస్ కాప్స్ ఫేస్-2 శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమానికి జెసి నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యార్థుల కోసం జిల్లాలో ఓ మంచి కార్యక్రమం ప్రవేశపెట్టారు. ఈ క్యాంపస్ కాప్స్ ద్వారా విద్యార్థులకు చట్టాల పైన, నాయకత్వ లక్షణాలు, సైబర్ నేరాలు నియంత్రణ వివిధ అంశాలపై ఈ మూడు రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణ కాలంలో నేర్చుకున్న విషయాలు నిజజీవితంలో ఆచరణలో ఉంచి మరో పదిమందికి అలాంటి ముఖ్యమైన విషయాలు షేర్ చేసుకోవలన్నారు. పేదరికం చదువుకు అడ్డురాదు అని విషయం ప్రతీ ఒక్కరూ గుర్తించాలన్నారు. గమ్య స్థానానికి తొలి అడుగు విజయానికి తోలి మెట్టు అని ఆయన తెలిపారు. చదువుతో పాటుగా విద్యార్థులుకు సమయపాలన, స్కిల్ డవలెప్మెంట్,

నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడు ఉన్నతమైన పౌరులుగా మెలుగుతారని పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని అందుకోవడానికి సమయపాలన చాలా ముఖ్యమైనది అని కావున విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ కాప్స్ పోలిసింగ్ విధానం నేటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని శిక్షణ కాలంలో నేర్చిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవలంబించుకోవాలని సూచించారు. క్యాంపస్ కాప్స్ పోలీసింగ్ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువ అవుతున్నాయి. అలాంటి నేరాలు సామాన్య ప్రజలు భారిన పడకూడదు అందుకు యువత క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఆదనపు ఎస్పీ టిపి విఠలేశ్వర్ మాట్లాడుతూ శిక్షణ కాలంలో నేర్చుకున్న విషయాలు నిజజీవితంలో మీకు చాలా ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. తల్లిదండ్రులకు గురువును గౌరవించినప్పుడే సమాజంలో మన పాత్ర సుస్థిరమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో యువతకు చట్టాలపై అవగాహన చాలా అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం నవీనకు అదనపు విఠలేశ్వర్ చేతుల మీదుగా జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వై శ్రుతి,సి. ఎల్.సన్యాసి నాయుడు, ఎస్ఐలు గణేశ్, లక్ష్మణరావు విద్యార్థుల పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి పోషణ అవసరం

- ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు
- ఏడి డాక్టర్ ఆనంద్ రావు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాడు అంటే పశుపోషణ ఎంతో అవసరమని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ ఆనందరావు అన్నారు. గురువారం పట్టణంలోని 18 వ వార్డు లో పశువులకు ముద్ద చర్మవ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి పట్ల రైతులు, పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆ వ్యాధి నివారించేందుకు నిరోధక టీకాలు అవసర మని వివరించారు.ఈ వ్యాధి(లంపీ స్కిన్ వ్యాధి/ముద్ద చర్మ వ్యాధి) రాకుండా ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండాలంటే ప్రతి పశు పోషకుడు ఖచ్చితంగా ఈ టీకా లను వేయించు కోవాలి. ఇప్పటి వరకు మునిసి పాలిటీ పరిధిలో ఉన్న 18 వార్డులలో సుమారు 1858 పశువులకు టీకాలు వేయడం జరిగినది. గురు వారం హడ్కో కాలని, మెట్టక్కివలస గ్రామాల్లో 86 పాడి పశువులకు టీకాలు వేసారు. ముందస్తు టీకాలు వ్యాధి రాకుండా వేసుకుంటే రైతులు పశువులు వ్యాధి భారిన పడకుండా రక్షించు కో వచ్చునని స్థానిక పశు

వైద్యశాల సహాయ సంచాలకులు, డాక్టర్ ఆర్. ఆనందరావు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది రైతులు ఉన్నారు.

ఇస్రో దేశానికే గర్వకారణం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : కోట్లాది భారతీయుల కీర్తిని ఇనుమడింపజేసిన భారత శాస్త్రవేత్తల కృషి అభినందనీయమైనది పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలో గురువారం పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచదేశాల్లో భారత శక్తిని నిరూపించిన ఇస్రో దేశానికి గర్వకారణమని అన్నారు. ఇంతవరకు ఎవ్వరు చేరుకోని చంద్రుని దక్షిణ ధృవాన్ని ఎంచుకుని కాలు మోపిన ఘట్టం చారిత్రాత్మకమని అన్నారు. కాదాలక్ష్మికాంతం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో హెచ్.ఎం. పద్మవల్లి ఆధ్వర్యంలో చంద్రయాన్ ప్రయోగాన్ని విద్యార్థులకు చూపించారు. ఇస్రో ఆకారంలో విద్యార్థినులు కూర్చుని భారత జెండాలను ఊపుతు కృతజ్ఞతలు తెలిపారు. అంతరిక్ష వైజ్ఞానిక రంగంలో భారతదేశం ఓ శక్తిగా ఎదగడం గొప్ప పరిణామమని, భవిష్యత్‌లో ఇస్రో ద్వారా మానవులు చంద్రునిపై అడుగుపెట్టే పరిస్థితులు రాగలవని శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ దక్కత క్రిష్ణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె.సి పూరి, సురేఖ తదితరులు పాల్గొన్నారు. స్వర్ణభారతి విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

పీఆర్వో సెక్షన్‌కు నూతన ఫొటో కెమెరా

ఎస్పీ జి.ఆర్. రాధిక చేతులమీదుగా అందజేత

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా పోలీసు కార్యాలయం పోలీసు పిఆర్వో సెక్షన్ కు నూతన ఫొటో కెమెరా జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక చేతులు మీదుగా అందజేశారు. ఈ మేరకు గురువారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, పోలీసు పిఆర్వో ఎం.భాస్కర్ నకు నూతన కెమెరా అందజేశారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కెమెరా పనిచేయుడం లేదని ఎస్పీ దృష్టిలో పెట్టగానే రెండు రోజుల్లో కెమెరాకు అవసరమైన నిధులు తక్షణమే ఎస్పీ మంజూరు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇస్తున్న కెమెరా జిల్లా పోలీసు కార్యకలాపాలకు సక్రమంగా ఉపయోగించి జిల్లా పోలీసు శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రజలకు క్షేత్రస్థాయిలో చేరేలా మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్ఐ (వేల్ఫేర్) ఉమా మహేశ్, ఫోటో గ్రాఫెర్లు టి.రాము, పి మల్లేశ్వరరావు ఉన్నారు.

పిల్లల ప్రవర్తన తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలక పాత్ర

- జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నేడు చిన్నపిల్లల్లో మంచి ప్రవర్తన సోదర భావము మరియు దేశభక్తి చిన్నతనం నుంచి పెంపొందించే దిశగా

కార్యక్రమములు రూపొందించదానికి పిల్లల పర్యవేక్షణ చూసే సంబంధిత ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ పిల్లలు ఇంటి దగ్గర ఉన్నంత సేపు తల్లిదండ్రు లు వారి ప్రవర్తన అనుక్షణం గమనిస్తూ ఎవరైనా పిల్లలలో ఏమాత్రం చిన్న తేడా కనిపించిన వెంటనే దిద్దిపాటు చర్యలు చేపట్టాలని నిర్లక్ష్యం వహిస్తే అవి పిల్లల ప్రవర్తనలో లోపాలుగా మారుతా యన్నారు. కావున తల్లిదండ్రులు ఓర్పు సహనముతో సామాజిక బాధ్యత వహించి ఎంతో జాగ్రత్తగా పిల్లలను పెంచాలని ఇదే విధంగా ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను స్కూల్లో ఉన్నంతసేపు ప్రత్యేక వ్యక్తిగత శ్రద్ధ పెట్టి అనుక్షణం గమనిస్తూ ఉండాలని చిన్నతనం నుంచే పిల్లలకు సోదర భావము దేశభక్తి వంటి మంచి లక్షణాలు అలవాటు చేయాలని తెలిపారు. పిల్లల్లో సత్ప్రవర్తన పెంపొందించదానికి తగిన సూచనలు సలహాలు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు, జువైనల్ జస్టిస్ మెజిస్ట్రేట్ శారదాంబ, మొబైల్ మెజిస్ట్రేట్ కుమారి శ్రీవిద్య, జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, మెంబర్లు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వి రమణ, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్ ఆఫీసర్ బి వి రవికుమార్, జువైనల్ జస్టిస్ ఆక్ట్ డీల్ చేసే పోలీసులు, ఎన్జీవోలు ఆర్ఫ్ సంస్థ బెజ్జిపురం యూత్ క్లబ్ బ్రెడ్స్ ఎన్జీవో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - కవిటి: మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామస్తులు,ఉపాధ్యాయ సిబ్బంది, యాజమాన్య కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీ రామ్ ప్రసాద్,ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ తదితరులు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆర్ బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన టి రవి,ఎన్ పాపారావు,కే సురేష్,బి గణేష్,బీటీ వెంకటేశ్వరరావు, నిరో రోల్లో లను సర్పంచ్ ప్రతినిధి మద్దిలి ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్ తారకేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొని ఉపాధ్యాయులను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ

అవగాహన కల్పించడానికి సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: ఉపాధి హామీ పథకం పనులపై ప్రజలకు అవగాహన కల్పనలో భాగంగా గ్రామాలలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్పి వెంకటరమణ అన్నారు. మండలంలో గల పద్ద పంచాయతీలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం, ఐటిడిఏ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి చేసిన పనులను మూడు రోజుల సామాజిక తనిఖీ ద్వారా పనుల పరిశీలనలో భాగంగా మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులు అవ్వాలన్నారు. అనంతరం తనిఖీ నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. పూర్తి నివేదిక ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామసభలో ఎస్ఆర్పి వెంకటరమణతో పాటు స్థానిక సర్పంచ్ రామచంద్ర మజ్జి, ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, డి ఆర్ పి నాయుడు, కార్యదర్శి అప్పారావు, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణారావు, క్షేత్ర సహాయకులు రాజు, తిరుపతి, గ్రామస్తులు తదితరులున్నారు.

ఆసుపత్రిలో రోగులకు ఆమె అంటేనే హడల్..?

- మురపాక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సు అశ్విని పై స్థానికుల ఆవేదన..?
- పేషంట్స్ పై నిత్యం చిర్రు బర్రు
- ఇంజక్షన్ కోసం గంటల తరబడి పేషంట్స్ నిరీక్షణ...

విశాలాంధ్ర-లావేరు: మండలం మురపాక గ్రామ పరిధిలోని ప్రాథమిక కేంద్రానికి వెళ్లి ఇంజక్షన్ చేసుకోవాలంటే స్థానిక ప్రజలకు ఒక సవాలుగా మారింది. అనారోగ్యంతో బాధ పడుతూ గంటల తరబడి నిరీక్షించాల్సిందే. విసిగి

చెంది ఇంజక్షన్ చేయమని ఆరోగ్య కేంద్రంలో గల స్టాఫ్ నర్స్‌గా పనిచేస్తున్న అశ్విని అనే నర్సుని అడిగితే ఇంకా అంతే సంగతులు.. కళ్ళు ఎర్ర చేసి నోటికి పనిచెబుతుందని ఆసుపత్రికి వెళ్లిన రోగులు చెబుతున్నారు. విషయం తెలిసి స్థానిక పెద్దలు అక్కడికి వెళ్లి అడిగితే కనీస బాధ్యత లేకుండా రెక్లెస్‌గా సమాధానం చెప్పడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానిక పెద్దలు ను కొంతమంది అడుగగా ఆమె తీరుపై అందరూ విసుగు చెందుతున్నట్లు చెబుతున్నారు. ఆమె తీరుపై ఆసుపత్రి అధికారిని డాక్టర్ సౌమ్య నీ వివరణ కోరగా స్టాఫ్ నర్స్ అశ్విని ఇలాంటి ప్రవర్తనపై హెచ్చరించామని మరలా పునరావృతం కాకుండా చూస్తామని అన్నారు.

ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రముల పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార వారి ఆదేశం

మేరకు శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు అధ్యక్షులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా సూచన మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్ సన్యాసినాయుడు గురువారం న్యాయ సేవా సదంలో ట్రాన్స్ జెండర్లకు వివిధ ప్రభుత్వ అందించే పథకాల ద్వారా లబ్ధి అందించే విషయమై న్యాయసహాయం అందించుటకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ లపై సమాజంలో ఎవరు వివక్షత చూపరాదని వారిని సాధారణ పౌరులకు మర్యాద ఇచ్చినట్లే మర్యాదపూర్వకంగా వారితో మెలగాలని తెలిపారు. ట్రాన్స్ జెండర్ లలో ఎవరికైనా ప్రభుత్వం అందించే పథకాలు అందుకోవటంలో ఏదైనా సహాయం కావాల్సి వస్తే న్యాయ సేవాధికార సంస్థ చేదోడువాదోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసబిలిటీ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ శారద, మెప్మా పీడీ కిరణ్ కుమార్, అడిషనల్ డి ఎం ఎన్ హెచ్ ఓ హెచ్ వో డాక్టర్ అనురాధ, హౌసింగ్ పీడీ గణపతి, బీసీ వెల్ఫేర్ ఎస్సీ వెల్ఫేర్ కార్పొరేషన్ అధికారులు బెజ్జిపురం యూత్ క్లబ్ ఎన్జీవో ప్రసాదరావు, పెద్ద సంఖ్యలో పోలీసులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణ, తదితరులు న్యాయవాది ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రములు పంపిణీ చేశారు.

మంచి చేస్తున్న జగనన్నకు తోడై నిలుద్దాం

వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ వాణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: అడగకుండానే అన్నీ ఇస్తూ రాష్ట్రాభివృద్ధికి అహర్నిషలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరు తోడై మరోసారి అండగా నిలవాలని టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దువ్వాడ వాణి అన్నారు. అమె గురువారం మండలం దుప్పిలపాడు, కొప్పలపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అమె ఇంటింటికి తిరిగారు. గత నాలుగేళ్ళులో ప్రభుత్వం నుంచి పొందిన లబ్దిని తెలియజేస్తూ లబ్దిపత్రాలను అందజేశారు. మహిళల నుంచి వేశేష స్పందన లబించింది. ఈసందర్భంగా దువ్వాడ వాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కోసం ఎవరు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని వాలంటీర్లకు చెబితే దరఖాస్తు చేస్తారని అమె తెలిపారు. అలాగే అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వచ్చే ఎన్నికలలో అధికారం కోసం ప్రజలకు అసత్యలు చెప్పి ప్రజలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయటానికి ఇప్పటినుంచే ఎన్నో ఎత్తుగడలు వేస్తుందని దీనికి ప్రజలంతా కలిసి తిప్పికొట్టి జగన్‌మోహన్ రెడ్డికి మళ్ళీ ముఖ్యమంత్రి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వినర్లు ఇన్‌చార్జీ గద్దవలస నాగభూషణరావు, స్థానిక మండల కన్వీనర్ నూక సత్యరాజు, జిల్లా రైతుభరోసా అడ్వైజరి కమిటి సభ్యులు కవిటి రామరాజు, హైందవిమోహన్, కో-ఆప్షన్ మెంబర్ షేక్ రాజు, యూత్ ప్రెసిడెంట్ తర్రా కామినయుడు, సర్పంచ్‌లు గురుబెల్లి భారతి సూర్యాప్రకాష్, ఎంపీటీసీ సింగూరు వాసుకళ్యాణి, బోనెల యల్లయ్య, సుంకర జనార్దన్, పంకు సింహాచలం, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు మరియు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఐప్వా 9వ జాతీయ మహా సభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పలాస: న్యూఢిల్లీలో సెప్టెంబర్ 30 నుండి1వ తేదీ వరకు జరగబోయే మహిళ జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని శ్రీకాకుళం జిల్లా మహిళా నాయకులు కోనారి ఈశ్వరమ్మ,మద్దిల తులసమ్మ, పోతనపల్లి సుందరమ్మ,మద్దిల వరలక్ష్మి చంద్రమ్మలు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సూది కొండ కోలనీలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా100 మంది మహిళలకు సభ్యత్వం నమోదు చేశారు. సమ న్యాయం - సమానత్వం కోసం మహిళా పోరాటాలను ఉద్రుతం చేయాలని అన్నారు. ప్రజాస్వామిక సమాజం నిర్మాణం కోసం ఏకంకావాలని పిలుపునిచ్చారు. నేడు వాస్తవిక పరిస్తితి గమనిస్తే దేశంలోను, రాష్ట్రంలోను చిన్నారులు మహిళలపై హింసా, అత్యాచారాలు, హత్యలు, పరువు హత్యలు, స్త్రీ భృణ హత్యలు,మంత్ర విద్యల మూఢ విశ్వాసాలు, ఆన్ లైన్ లో బ్లాక్ మెయిలింగ్,క్రరత్వం వంటి నేరాలు బిజెపి అధికారంలోకి వచ్చిన నాటినుండి విపరీతంగా పెరిగి పోయాయని అన్నారు.మణిపూర్‌లో మహిళలను నగ్నంగా వీధుల్లో ఊరేగించిన ఘోరాతి ఘోరమైన,హేయమైన ఘటన అని మోడీ ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన పాలనకు యిది పరాకాష్ట అని అన్నారు.మహిళలు రక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాల్సింది పోయి రేపిస్ట్ బాబాలు, మఠాధిపతులు, సమాజంలో రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు. పురుషాధిక్య భావజాలాన్ని ప్రచారం చేసే ప్రవచనాలను బిజెపి ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసలకు వ్యతిరేకంగా మహిళా లోకం ఏకం కావాలని పిలుపునిచ్చారు.. సెప్టెంబర్ నెలలో ఢిల్లీలో జరుగుతున్న ఐప్వా మహాసభలను ఆర్థికంగా,, హార్థికంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ,రైతులు విద్యార్థులు యువకులు మహిళల పక్షాన నిలబడి ఆదుకోవాలని,మహాసభలు విజయవంతం చేయటానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందివ్వాలని పిలుపు నిచ్చారు. సీతమ్మ, జోగేశ్వరితో పాటు సీపీఐ యం యల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు, సిమ్మయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రోత్సాహించాలి

- రాష్ట్రంలో వివిధ ప్రాంతాల ఉత్పత్తులు ఒకే చోట లభ్యం
- జిల్లా ప్రజలు అవకాశాన్ని వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: చేనేత కార్మికులు తయారుచేసే వస్త్రాలను జిల్లా ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత వస్త్ర ప్రదర్శన మరియు విక్రయాలు ఏడురోజ్ల కూడలి దా. వై.ఎస్.ఆర్. మున్సిపల్ కళ్యాణ మండపంలో గురువారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, దేశంలో జిల్లా చేనేత వస్త్రాలకు మంచి పేరుందని, ముందుగా జిల్లా ప్రజలే చేనేత కార్మికులను ప్రోత్సాహించాలన్నారు. జిల్లా అధికారులు ప్రతీ సోమవారం చేనేత వస్త్రాలను ధరించుకొని స్పందనకు హాజరు కావాలని తెలిపినట్లు చెప్పారు. జిల్లాకు 4 క్లస్టర్స్‌కు 4 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడమైనదని, రాష్ట్రంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఏ ప్రాంతంలో ఏర్పాటు చేసినా జిల్లా నుండి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేనేత కార్మికులను తీసుకువెలుతున్నట్లు వెల్లడించారు. టెక్స్ టైల్ రంగానికి మరింత ప్రోత్సాహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వివిధ ప్రాంతాల్లో తయారు చేసిన వస్త్రాలు ఒకే చోట లభిస్తాయని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా చొరవతో ఈ వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రుణాలు కావాలంటే సంబంధిత అధికారులు ద్వారా బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. దేశంలో వ్యవసాయం తరువాత అతి పెద్ద వృత్తి చేనేత రంగం అని అన్నారు. ఈ వృత్తిపై అధిక శాతం ప్రజలు ఆధారపడి ఉన్నారని తెలిపారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్న సంగతిని గుర్తుచేశారు. చేనేత కార్మికులు తయారుచేసే వస్త్రాలకు మార్కెటింగ్ ప్రధాన సమస్యని, ఈ సమస్యను అధిగమించి కార్మికులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఇటువంటి వస్త్ర ప్రదర్శనలను ఏర్పాటుచేసి విక్రయాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రంలో ఈ నెల 24 నుండి 28 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 20 స్టాల్స్ ద్వారా వస్త్ర ప్రదర్శనతో పాటు విక్రయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున జిల్లా ప్రజలు విరివిగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేతకు చేయూతను అందించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. చేనేత యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత,జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు, ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిపిఆర్ఓ కె. బాలమాన్ సింగ్, డెవలప్ మెంట్ అధికారులు ఆర్. శేఖర్, యస్.శ్రీను, ఎండిఓ ఇ. రమేష్, వివిధ సహకార ఉత్పత్తి విక్రయ సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, సేల్స్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవంలో భాగంగా సేవలు చెయ్యటం అభినందనీయం

- అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి. విఠలేశ్వర రావు
- వికలాంగునకు చక్రాల కుర్చి వితరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: స్థానిక డే అండ్ నైట్ కూడలివద్దగల బాలాజీ మెడికల్ వార్షికోత్సవంలో భాగంగా సేవలు చెయ్యటం హర్షణీయమని ముఖ్య అతిధిగా పాల్గొన్న అదనపు ఎస్పీ క్రైమ్ టి.పి. విఠలేశ్వర రావు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలకు అందరూ అతిగా డబ్బులు వృధా చేస్తున్నారని, అలా కాకుండా ఆ నగదుని సేవలకు వినియోగించటం గొప్ప విషయమని ఈ రోజు వేడుకలలో అన్నదానం కూడా నిర్వహిస్తున్నారని, ఈసేవలో నన్ను భాగం చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో వికలాంగునకు బాలాజీ మెడికల్స్ జామి. కిరణ్ కుమార్ సహకారంతో చక్రాల కుర్చీని అదనపు ఎస్పీ చేతుల మీదుగా అందించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులను, రక్త దాతలను, కొన్ని స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులను అదనపు ఎస్పీ, అలాగే అసిస్టెంట్ డైరెక్టర్ - డ్రగ్ కంట్రోల్, ఎం. చంద్రశేఖర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎన్. యుగంధర్ లు మెమొంటో, దుస్సాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీకి జామి కిరణ్ కుటుంబ సభ్యులు మొక్కను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జామి. కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులు, బాలాజీ మెడికల్ యాజమాన్యం, ప్రాణదాత దోకి. శ్రావణ్, కలివరపు. సూర్య ప్రకాష్, జిల్ ఫౌండేషన్, మదర్స్ లవ్ ఫౌండేషన్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి, శ్రీకాకుళం గ్రీన్ సిటీ, చేయూత మేమున్నాము,ప్రాణదాత సభ్యులు, జి. దేవి కృపాల్, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత భాషా వారోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ లో సంస్కృత భాష వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ దేవదత్తానంద్ విద్యార్థులను ఉద్దేశిస్తూ సంస్కృత భాష అన్ని భాషలకు మూలమని, అట్టి భాషను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. పాఠశాల సంస్కృత పండితులు పి. ఆదిత్య విద్యార్థులను ఉద్దేశిస్తూ సంస్కృతములో శ్లోకాలు వాటి పరమార్థం ద్వారా నైతిక విలువలు కు మార్గం సుగమం అవుతుందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

పలాసలో భారీ వర్షం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ తో పాటు గ్రామీణ ప్రాంతాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం వరి పొలాలు సాగునీరు అందక బీట్లు వారిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నా తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వర్షం కురవడంతో పట్టణ రోడ్లు వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో మురికి కాలువలో ఉన్న చెత్తాచెదారం రోడ్లపై ప్రవహించడం తో పట్టణ ప్రజలు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గ్రామాలాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-పలాస: గ్రామాల అభివృద్ధే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ అన్నారు. గురువారం మండలం అమలకుడియా పంచాయతీ వీరభద్రపురం గ్రామం లో గడప గడప కార్యక్రమం నిధుల ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు సీసీ డ్రైన్లు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి అప్పలరాజు ఆదేశాల మేరకు మండలంలోగల గ్రామాలు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురలీకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి, బి. కుమార్, కె, హరినాథ్, బి.భీమరావు పైల కృష్ణారావు, పైల జనార్ధన రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పురుషోత్తపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నేత్ర వైద్యురాలు షీలా విద్యార్థులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాఠశాల హెచ్.ఎం లత ఆధ్వర్యంలో సుమారు 600 మంది విద్యార్థులకు పరీక్షలు జరిపారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులకు ఉచితంగా ఔషదాలు అందజేసారు.

డిఎంయుల రాజీనామాలతో కదిలిన యంత్రాంగం

విశాలాంధ్ర-సోంపేట : ప్రజాపంపిణీ వ్యవస్థలో డిఎంయులుగా విధులు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులతో రాజీనామాలకు సిద్ధమైన పలువురు డిఎంయులు రాజీనామాకు సిద్ధమైన నేపథ్యంలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తీవ్రంగా స్పందించారు. వివరాల్లోకి వెళితే ప్రతినెలా ఇంటింటికి సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యం కోసం ఒక వేలి ముద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పంచదార కోసం మరో వేలిముద్రను సేకరించడం డిఎంయు ఆపరేటర్లకు ఇబ్బందికరంగా మారింది. నెట్‌వర్క్ సరిగా లేని గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఒక వేలి ముద్రకే గ్రామీణ ప్రాంతాల్లో సతమతమవుతున్న డిఎంయు ఆపరేటర్లు తాజాగా రెండు వేలిముద్రల సమస్యలతో నానా అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు అధికారుల ఒత్తిడిలు కూడా మరింత అధికమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కఠిన నిబంధనలతో విధులకు న్యాయం చేయలేక సోంపేట మండలంలో ముగ్గురు డిఎంయు ఆపరేటర్లు తమ రాజీనామా పత్రాలను తహశీల్దార్ సత్యన్నారాయణకు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆదరాబాదరాగా తహశీల్దార్ సత్యన్నారాయణ మండలంలో గల రేషన్ డీలర్లు, డిఎంయు ఆపరేటర్లతో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ మాట్లాడుతూ రెండు వేలి ముద్రల వల్ల ఆపరేటర్లు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని కొద్ది ఆలస్యం జరిగినా విధులు నిర్వహించుకోవాలని సూచించారు. రాజీనామాలు విరమించుకోవాలని కోరారు. సమావేశానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు కూడా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగా ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావు లేకుండా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీలో పలు మార్పులుచేపట్టిందని అన్నారు. అందులో భాగంగానే ఇంటింటికి నిత్యావసర సరుకులు అందజేస్తూ ఆయా రేషన్‌కార్డుదారుల నుంచి వేలిముద్రలు సేకరిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు దీన్ని సక్రమంగా అర్థం చేసుకుని అవినీతి లేని పరిపాలనకు సహకరించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే రాజీనామాలకు సిద్ధమైన డిఎంయు ఆపరేటర్లతో మాట్లాడడం జరిగిందని అన్నారు. ఎవరూ ఇబ్బందులకు గురి కావద్దని అన్నారు. రెండు వేలిముద్రల ప్రక్రియ తాత్కాలికమేనని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాజీనామాలకు సిద్ధమవ్వడం ఎంత మాత్రం తగదని పేర్కొన్నారు. దీంతో రేషన్ డీలర్లు, డిఎంయు ఆపరేటర్లు తమ నిర్ణయాలను వెనక్కి తీసుకున్నారు.

భూ యాజమాన్యపు హక్కులు క్రమబద్ధీకరించాలి

విశాలాంధ్ర-కవిటి: నాలుగు దశాబ్దాల క్రితం మంజూరు కాపాడిన భూ యాజమాన్య హక్కులు క్రమబద్ధీకరించాలని చంటిపుట్టుగ గ్రామ రెవెన్యూ పరిధిలో గల రైతులు తాసిల్దార్ వి శేఖర్ కు గురువారం తాసిల్దార్ కార్యాలయంలో కలిసి ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో శేఖర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంటిపుట్టుగ గ్రామ రైతులు మాట్లాడుతూ చండిపుట్టుగ గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నంబర్ 50 లో బీడు భూమి నమోదు అయిన నాలుగు దశాబ్దాలు క్రితం మంజూరు కాబడిన భూ యాజమాన్యపు హక్కులు క్రమ బద్ధీకరించి లబ్దిదారులైన రైతులకు సకల హక్కులను కల్పించాలని కోరారు. చండిపుట్టుగ గ్రామ రెవిన్యూ పరిధిలో 1970 వ సంవత్సరం సర్వే నెంబర్ 50 లో ఒకొక్క సన్నకారు రైతు కులీలకు 0.25సెంట్లు వంతున బీడు భూమిని వాటి ఫల సాయము అనుభవించేందుకు అనుమతి మంజూరు చేశారని తెలిపారు.కాలక్రమమైన 1983 వ సంవత్సరంలో ఈ బీడు భూమిగా కేటాయించిన భూములను పట్టాదారు పాస్ పుస్తకములుగా బదిలీ చేస్తూ కవిటి మండల రెవిన్యూ శాఖా అధికారులు సకల హక్కులు (బ్యాంకు ఋణాలు పాస్ పుస్తకానికి కావాల్సిన సకల హక్కులు)ను కల్పించారు.కానీ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సమగ్ర భూ సర్వేలో ఈ బీడు భూమి హక్కులు పొందిన భూమిని సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు నిరాకరించారని తెలిపారు. సన్న కారు,చిన్నకారు రైతుల పట్ల దయచూపి జిరాయితీ హక్కులతో సదరు భూములన్నీ లబ్దిదారులైన రైతులకు పూర్తిగా యాజమాన్యపు హక్కులను దఖలు పరిచేలా ఉత్తర్వులు మంజూరు చేయాలని వినతులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎన్ని అశోక్ ,నీలయ్య , అప్పలస్వామి, నరసింహమూర్తి, లచ్చుమయ్య పాల్గొన్నారు.

మరమ్మతుల పేరిట రోడ్డుపై గోతులు

- నీటి చౌర్యం నివారించని అధికారులు
- చోద్యం చూస్తున్న అధికారులు... - పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మరమ్మతుల పేరట నిత్యం రోడ్డుపై గోతులు తవ్వకం కారణంగా ప్రయాణికులకు ఇబ్బంది ఎదురవుతుంది. ఇటువంటి నీటి చౌర్యాన్ని అధికారులు చూస్తున్నప్పటికీ కనీసం పట్టిం చుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. పాలకులు కూడా ఓట్లు సీట్లు వ్యాఖ్యలు చూసి చూడనట్టుగా వివరిస్తున్నట్లు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా కు పాట్లు మున్సిపల్ సిబ్బంది అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన తాగునీటి పైపులైను నేటికీ దానినే మరమ్మతులు చేస్తూ తాగునీరు అందిస్తున్న సమయంలో ఎక్కడి కక్కడ లీకేజీ సమస్యలు ఏర్పడు తున్నాయి. నిత్యం సిబ్బంది వీటి మరమ్మతులపై దృష్టి సారించాల్సి ఉంటుంది. అంతేకాకుండా పట్టణ ప్రధాన రహదారి మధ్యలో పైప్లైన్ ఉండడంతో రోడ్డును ఎక్కడి కక్కడ గుంతల తవ్వి గంటల తరబడి మరమ్మతులు చేయ దంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ ప్రాంతంలో ఇటువంటి పనులు చేయడం మూలాన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శుద్ధ జల పంపిణీ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ వాటిని మరమ్మతులకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి కొత్త పైపులైను డిజైన్ చేసినప్పటికీ నేటికీ అమలు కావడం లేదు. ఇదిలా ఉండగా సమితుల కాలంనాటి పైపులైన్ కావడంతో లక్ష్మీ నగర్ వీధిలో ఒక ప్రముఖ వ్యాపారి పైపులైనుకు మీదుగా గృహాన్ని నిర్మించారు, అలాగే ఆ వరుస క్రమంలో మరి మూడు గృహాలు నిర్మాణాలు జరిగాయి. ఇటీవల ఆ పైప్ లైన్ లీకులు కారణంగా ఆ ఇల్లు ప్రమాదకరంగా మార దంతో నాయకుల ప్రోత్సాహంతో వ్యాపారి వద్ద కొంత మొత్తాన్ని తీసుకొని అటుపక్కగా లైన్ మార్చి తాగునీరు అందిస్తున్నారు. ఈ కారణంగానే డౌన్ స్ట్రీమ్ పైపులైను నిత్యం మొరాయిస్తుంది, రిపేర్ చేసేందుకు రోడ్డు మధ్యలో గోతులు తవ్వాల్సి వస్తుంది. అంతేకాకుండా పట్టణంలో కొందరు పెద్ద మనుషులుగా వ్యవహరిస్తూ నీటి చౌర్యానికి పాల్పడుతుండడంతో ఈ దుస్థితి ఏర్పడు తుంది. కట్టెల చేయాల్సిన అధికారులు ధృతరాష్ట్ర పాలన చేస్తున్నారు. నేతలు చూసి చూడనట్టు వ్యవహరించడంతో ఈ పెద్దలు ఆగడాలకు అంతులేకుండా పోతుంది. మోటార్ల నిలువరించండని అధి కారులు చెప్పడమే తరవుగా వారిపై విరు చుకుపడుతున్నారు. అధికార పార్టీ కార్య కర్తలమంటూ మాకు ఎదురు సమాధానాలు ఇస్తారా అంటూ అధికారులను నిర్బంధిస్తు న్నారు. విధి నిర్వహణలు మరిచిన అధి కారులు వారిచే మామూల మత్తులో జోగు తున్నారు. ఇటువంటి మరమ్మ తులన్నీ కూడా కంప్లైంట్ బుక్ లో లిఖించి ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తున్నారు. నిర్వహణ వ్యయం తిరుగుతున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. అంతే కాకుండా రోడ్లను తవ్వి రోజుల తరబడి మరమూర్తులు చేయడంతో వాహనాల రాకపోకలకు, ప్రయాణికులకు వాహన చోదకులకు రోడ్లు అనేక ఇబ్బందులు కలిగి స్తున్నాయి. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు అధికార పార్టీ కార్యకర్తలకు తలొగ్గి పనిచేయటం ప్రజాస్వామ్య వ్యవస్థలో సిగ్గుపడాల్సిన అవసరం. ఇటీవల అభివృద్ధి పేరిట అటు బొడ్డేపల్లి పేట రహదారి పనులు కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. లక్ష్ముదు పేట గ్రామంలో నివాస గృహాలు మధ్యలో సిమెంట్ రహదారివేయటం స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ అధికార పార్టీ చోట నాయకుడు మౌఖిక ఆదేశాలకు సాంకేతిక అధికారులు తలొగ్గి నట్టు తెలిసింది. అలాగే పోలీస్ స్టేషన్ వెనుక భాగం నుంచి గణేష్ నగర్ వీధికి ఉన్న దారి చుట్టూరా అభివృద్ధి పనులు పేరిట మూసి వేశారు. దీంతో ఆ ప్రాంతవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీ వల ఎండీయూ రేషన్ వాహనం కూడా వీధి లోకి రాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందు లు ఎదుర్కొన్నారు. ఆ వీధిలో ఒకరు మృతి చెందడంతో దూరం నుంచి వచ్చిన బంధు వులు కూడా మృతదేహాన్ని చూసేందుకు ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా సచివాలయాల పరిధిలో మురికి కాలువలు సిమెంట్ దారులు డ్రైనేజీల మరమ్మత్తులకు, కొత్త నిర్మాణాలకు నిధులను కేటాయించారు. పురుషోత్తపురం గ్రామానికి చెందిన అంజ నేయులు కాంట్రాక్టర్ కు ఈ పనులు అప్ప గించారు. ఆయన మరొకరికి లీజుకి ఇచ్చారు. నాణ్యతలు పాటించి పనులు జరిపించాలని సాంకేతిక నిపుణులు మొండికేయడంతో పనులలో జాప్యత పెరిగింది. నెల రోజులుగా గణేష్ నగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ దారులను మెరుగుపరచడంలో అటు సిబ్బంది ఇటు గుత్తేదారు సమన్వయ లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడవలసి వస్తుంది. పైపులై మరమ్మతులు కారణంగా రోడ్లు వాడుతున్నాయి. అభివృద్ధి పనుల్లో జాప్యం కారణంగా మరి నీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యేక అధికారిగా ఆర్డీవో పలుమార్లు పట్టణంలో తిరుగు తున్నప్పటికీ ఈ అంశాలు పట్టించుకో లేదనే పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ అంశంపై దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.